# సాక్షి
# అనంతపురం

శుక్రవారం । 9 । మే । 2025






## ఆర్టీసీలో ఆగని దోపిడీ

ఆర్టీసీలో దోపిడీ ఆగడం లేదు. ఉన్నతాధికారుల అలసత్వం కారణంగా కొందరు జేబులు నింపుకుంటున్నారు. 10లో



## టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.3,100 ప్రకారం ధర పలికాయి.




జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం అధికంగా కొనసాగుతోంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు

**అనంతపురం అర్బన్/ ఉరవకొండ/ వజ్రకరూరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 10.55 గంటలకు శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయానికి ఆయన చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.25 గంటలకు వజ్రకరూరు మండలం ఛాయాపురం చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో హంద్రీ–నీవా కాలువ వెంబడి ప్రయాణిస్తూ వెడల్పు పనులను పరిశీలిస్తారు. అనంతరం ఛాయాపురంలో 'ప్రజావేదిక' కార్యక్రమంలో పాల్గొంటారు. గ్రామస్తులతో మాట్లాడతారు. మధ్యాహ్నం 2.15 గంటల వరకు విశ్రాంతి తీసుకుని 2.30 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు. అనంతరం ప్రత్యేక విమానంలో బెంగళూరు వెళతారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. ఏర్పాట్లను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్ పరిశీలించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### హెచ్చెల్సీ వంతెన పనులు వేగవంతం చేయండి

**బొమ్మనహాళ్:** తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)పై జరుగుతున్న వంతెన పనులను వేగవంతం చేయాలని హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం మండలంలోని నాగలాపురం, మైలాపురం, దర్గాహొన్నూరు గ్రామాల పరిధిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు జరుగుతున్న సమయంలో అధికారులు లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లపై బాధ్యత వదిలేసి ఎక్కడికి వెళ్తున్నారని స్థానిక హెచ్చెల్సీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ మద్దిలేటి, జేఈఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

'హంద్రీ–నీవా కాలువను వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేపట్టొద్దు' అని యావత్తు ఉమ్మడి జిల్లా రైతాంగం ముక్త కంఠంతో నినదిస్తున్నా చంద్రబాబు సర్కారు ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతు సంఘాలు, వివిధ పార్టీల నాయకులు రోడ్లెక్కి ఆందోళనలు చేసినా, భవిష్యత్తులో భూగర్భ జలాలు మరింత కనిష్ట మట్టానికి పడిపోతాయని మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో కాసుల కక్కుర్తితోనే రైతుల ఆవేదనను గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

# కాలువ పనుల్లో కాసుల వరద

ఆత్మకూరు సమీపంలో జరుగుతున్న హంద్రీ-నీవా లైనింగ్ పనులు



### లైనింగ్.. దోపిడీకి టెండరింగ్

- హంద్రీ–నీవా లైనింగ్ పనుల్లో కాంట్రాక్టర్లకు డబ్బే డబ్బు
- కాంట్రాక్టు సంస్థల నుంచి నేతలకు భారీగా ముడుపులు!
- నాసిరకంగా పనులు జరుగుతున్నా కన్నెత్తి చూడని అధికారులు

**అనంతపురం సెంట్రల్:** ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో నీటి అవసరాలు బాగా పెరిగాయి. 80 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడ్డారు. భవిష్యత్‌లో పారిశ్రామికంగా కూడా మరింతగా ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందే అవకాశముంది. ఈ సమయంలో ఏ ప్రభుత్వమైనా తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తీసుకొచ్చే పనులకు శ్రీకారం చుడుతుంది. కానీ చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా హంద్రీ–నీవా కాలువకు సిమెంట్ పూతలు పూసే పనులకు తెరలేపింది.

**స్వలాభం కోసమే..**

హంద్రీనీవా ఫేజ్–2 కింద 7 ప్యాకేజీల్లో లైనింగ్ పనులు చేపడుతున్నారు. ఇందుకోసం రూ. 936 కోట్లు వెచ్చిస్తున్నారు. లైనింగ్ పనులకు టెండర్లు ఈ ఏడాది మార్చిలో ఖరారయ్యాయి. ఏప్రిల్ నుంచి పనులు చేపడుతున్నారు. జూన్ 10 నాటికే పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ క్రమంలో వేగంగా పూర్తి చేయాలనే నెపంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేస్తున్నట్లు తెలుస్తోంది. పనుల నాణ్యతను ఇంజినీర్లు ఎవరూ పరిశీలించే సాహసం చేయడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వలాభం కోసమే హంద్రీ–నీవా లైనింగ్ పనులకు తెర తీశారని, టీడీపీ ముఖ్య నేతలకు భారీగా ముడుపులు అందాయని, దీంతోనే ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అందుకే... 'లైనింగ్ పనులు వద్దు మొర్రో' అని రైతులు గగ్గోలు పెడుతున్నా పెడచెవిన పెడుతున్నట్లు పలువురు చెబుతున్నారు. కేవలం నీటిని తన సొంత నియోజకవర్గం కుప్పానికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో లైనింగ్ పనులు చేపడుతూ, తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఉమ్మడి జిల్లా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వైఎస్ కుటుంబంతోనే హంద్రీనీవాకు జీవం..**

2004కు ముందు ఉమ్మడి అనంతపురం జిల్లా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులను చూసింది. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ ప్రాంత పరిస్థితులను చూసి చలించిపోయారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేయాలని తలచి.. అప్పటివరకూ తాగునీటి పథకంగా శిలాఫలకానికే పరిమితమైన 'హంద్రీ–నీవా'ను తాగు,సాగునీటి ప్రాజెక్టుగా మార్చి 2009 నాటికే మొదటి దశ పనులను పూర్తి చేశారు. రెండో దశ పనులు కూడా 60 శాతం పూర్తయ్యాయి. ఆయన చలువతో 2012 నుంచి హంద్రీ–నీవా ద్వారా రాయలసీమ జిల్లాలకు సాగునీరు అందుతున్నాయి. ఇక.. వైఎస్సార్ బాటలోనే ఆయన తనయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హంద్రీ–నీవాను మరింత బలోపేతం చేయాలని సంకల్పించారు. ప్రస్తుతం 2,200 క్యూసెక్కుల నీటిని మాత్రమే తీసుకోగలుతున్నామని, దీన్ని 6,300 క్యూసెక్కులకు పెంచాలని నిర్ణయం తీసుకోవడమే కాకుండా తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే రూ. 6,182 కోట్లకు పరిపాలన అనుమతులిచ్చి టెండర్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. అయితే, ఆ క్రమంలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఒక్కసారిగా పరిస్థితి తలకిందులైపోయింది.



లైనింగ్ పనులు ఆపాలంటూ ఆందోళన చేస్తున్న జలసాధన సమితి నాయకులు (ఫైల్)

### హంద్రీ-నీవా ప్రాజెక్టు వివరాలు..

| | |
|---|---|
| మొత్తం ఆయకట్టు | 6.02 లక్షల ఎకరాలు |
| ప్రస్తుతం కాలువ ప్రవాహ సామర్థ్యం | 2,200 క్యూసెక్కులు |
| జగన్ హయాంలో నిర్ణయం మేరకు పెరగాల్సిన సామర్థ్యం | 6,300 క్యూసెక్కులు |
| చంద్రబాబు ప్రభుత్వం పరిమితం చేసింది | 3,850 క్యూసెక్కులు |

### జూన్ 10 నాటికి పనులు పూర్తి

హంద్రీ–నీవా లైనింగ్ పనులు జూన్ 10 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పనులు పరిశీలించేందుకు ఉరవకొండ నియోజకవర్గం ఛాయాపురానికి నేడు సీఎం వస్తున్నారు. అక్కడ గ్రామ సభ నిర్వహిస్తారు. అనంతరం లైనింగ్ పనులపై హంద్రీ–నీవా అధికారులతో సమీక్షిస్తారు. జిల్లాలో పనులు అన్నిచోట్లా ప్రారంభమయ్యాయి.

– నాగరాజ, సీఈ, జలవనరులశాఖ

### అకాల వర్షాలకు రూ.35.47 కోట్ల పంట నష్టం

- కలెక్టర్ వి.వినోద్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్

**అనంతపురం అర్బన్:** జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.35.47 కోట్ల దాకా నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో ఏప్రిల్ 21న కురిసిన వర్షానికి వ్యవసాయ పంటలకు రూ.15.90 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.93 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. అదే నెల 29న కురిసిన అకాల వర్షానికి వ్యవసాయ పంటలకు రూ.16 కోట్లు, ఉద్యాన పంటలకు రూ.63 లక్షలు, ఈ నెల 3వ తేదీ కురిసిన వర్షానికి వ్యవసాయ పంటలకు రూ.38 లక్షలు, ఉద్యాన పంటలకు రూ.1.63 కోట్ల నష్టం సంభవించిందన్నారు. ఇందుకు సంబంధించి నివేదికలను ప్రభుత్వానికి పంపించామన్నారు. వేసవిలో అకాల వర్షాలతో పాటు ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటి వరకు పిడుగుల కారణంగా ఒకరు మృతి చెందారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో 'పీ–4' సర్వే నిర్వహించి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 63,379 కుటుంబాలను గుర్తించామన్నారు. సంపన్నుల సహకారంతో వీటిని బంగారు కుటుంబాలుగా మారుస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు, సంపన్నులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, సీపీఓ అశోక్ కుమార్, కో–ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

## నాకు తెలీకుండా జాయిన్ అవుతారా?

- బ్రహ్మసముద్రం ఎంపీడీఓపై 'పచ్చ' నేత చిందులు
- స్థాన చలనం కల్పించాలని జెడ్పీ సీఈఓకు బాధిత ఎంపీడీఓ మొర

**బ్రహ్మసముద్రం:** 'నాకు తెలియకుండా విధుల్లో ఎలా జాయిన్ అయ్యారు' అంటూ బ్రహ్మసముద్రం నూతన ఎంపీడీఓ విజయసింహారెడ్డిపై టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు చిందులు తొక్కారు. ఈ విషయం ప్రస్తుతం మండలంలో చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి... కర్నూలు జిల్లాలో ఏఓగా పనిచేస్తున్న విజయ సింహా రెడ్డికి ఇటీవల ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. బ్రహ్మసముద్రం ఎంపీడీఓగా నియమించింది. దీంతో ఆయన బుధవారం బ్రహ్మసముద్రంలో విధుల్లో చేరారు. ఈ క్రమంలోనే అదే రోజు సాయంత్రం టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు ఎంపీడీఓ విజయసింహారెడ్డికి ఫోన్ చేశారు. తనకు తెలియకుండా ఎలా బాధ్యతలు స్వీకరించారంటూ మండిపడ్డారు. 'నేను చెబితేనే జాయిన్ అవ్వాలి. ఉండమంటే ఉండాలి. పొమ్మంటే పోవాలి' అంటూ రెచ్చిపోయారు. 'పచ్చ' నేత మాటలతో మనస్తాపం చెందిన ఎంపీడీఓ విజయ సింహారెడ్డి జెడ్పీ సీఈఓను కలిసి తనకు స్థాన చలనం కల్పించమని కోరినట్లు తెలిసింది.

**ఎమ్మెల్యే బంధువంటూ..**

బ్రహ్మసముద్రం మండలంలో తన మాటే శాసనం అన్న విధంగా టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు తీరు సాగుతోంది. తాను చెప్పినట్లు వింటేనే విధుల్లో చేరాలని.. లేదంటే ఆర్డర్ కాపీ తీసుకుని వెనక్కి వెళ్లి పోవాలని హుకుం జారీ చేస్తున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారు. మండలంలో ఉపాధి హామీ ఈసీగా పనిచేస్తున్న జయ ప్రకాష్‌ను ఉన్నతాధికారులు ఇటీవల కణేకల్లుకు బదిలీ చేశారు. కానీ, శ్రీరాములు అండతో జయప్రకాష్ అక్కడికి వెళ్లకుండా ఇప్పటికీ బ్రహ్మసముద్రంలోనే ఉన్నారు. ఇక.. బెళుగుప్ప మండలం నుంచి బ్రహ్మసముద్రం ఉపాధి ఈసీగా జయలక్ష్మిని పంపారు. కానీ, ఆమె విధుల్లో చేరకుండా టీడీపీ మండల కన్వీనర్ అడ్డుపడుతుండటం గమనార్హం. ఈ క్రమంలో నెల రోజుల నుంచి నిత్యం ఆమె కార్యాలయానికి వచ్చి వెనుదిరిగి వెళ్తున్నారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తన సమీప బంధువు అని చెప్పుకుంటూ ఇప్పటికే ఉపాధి పనుల్లోనూ శ్రీరాములు అవకతవకలకు పాల్పడ్డారు. శ్రీరాములు తీరును మండల ప్రజలే కాకుండా టీడీపీ నాయకులు సైతం చీదరించుకుంటున్నారు.

## కమీషన్లు తప్ప నీళ్లు పారించడం లేదు

- మా ప్రాంత ప్రజలను భిక్షాటనకు పంపాలని చూస్తున్నారా?
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

**అనంతపురం ఎడ్యుకేషన్:** 'రాయలసీమ జిల్లాల్లో హంద్రీ–నీవా ఆయకట్టు గ్రామాల్లో 40 టీఎంసీల నీళ్లు పారించేలా వైఎస్ రాజశేఖర రెడ్డి కాలువను తీసుకొచ్చారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కాంట్రాక్టర్ల ద్వారా కమీషన్లు పారిస్తున్నారు తప్ప నీళ్లు పారించడం లేదు. హంద్రీ–నీవా లైనింగ్ పనుల పర్యవేక్షణకు శుక్రవారం ఉరవకొండ నియోజకవర్గానికి వస్తున్న సీఎం చంద్రబాబు ఇక్కడి రైతుల మనోభావాలను తెలుసుకుంటే బాగుంటుంది' అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీ–నీవా కాంక్రీట్ లైనింగ్ పనులను రైతులు, రైతు సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలూ వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఇక్కడి రైతాంగ ప్రయోజనాలను తుంగలో తొక్కి కుప్పానికి నీళ్లు తరలించాలని చూస్తున్నారన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి తీసుకొచ్చిన 40 టీఎంసీల హంద్రీ–నీవాను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 83 టీఎంసీలకు పెంచారన్నారు. వైఎస్సార్, చిత్తూరు జిల్లాల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం గండికోట నుంచి గాలేరు–నగరి ద్వారా 20 టీఎంసీల ప్రాజెక్ట్‌ను తీసుకొచ్చిందన్నారు. దాదాపు రూ. 2 వేల కోట్ల దాకా ఖర్చు చేశారన్నారు. తక్కిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నా చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. గండికోట నుంచి 20 టీఎంసీల నీళ్లు వైఎస్సార్, చిత్తూరు జిల్లాలకు తీసుకెళ్తే...ఆ మేరకు 20 టీఎంసీల నీళ్లు అనంతపురం, కర్నూలు జిల్లాలకు మిగులుతాయన్నారు. 'దివంగత నేత ఎన్టీఆర్‌ను అత్యున్నత పదవిలో కూర్చోబెట్టిన ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతుల ప్రయోజనాలను కాపాడాలని లేదా.. మా ప్రాంత ప్రజలు వ్యవసాయం వదిలి బెంగళూరు, కేరళ ప్రాంతాలకు భిక్షాటనకు పోవాలని భావిస్తున్నారా' అని మండిపడ్డారు.

**శ్రీ సత్యసాయి, ఆర్డీటీ ట్రస్టులు జిల్లాకు రెండు కళ్లు**

భగవాన్ సత్యసాయి బాబా, ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జిల్లాలో ప్రతి ఒక్కరికీ ఆదర్శమూర్తులని ప్రకాష్ రెడ్డి తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఆర్డీటీ సంస్థపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని, విదేశాల నుంచి నిధులు అందకుండా ఆంక్షలు విధించడం ఏంటని ప్రశ్నించారు. మరోవైపు సత్యసాయి బాబా గౌరవాన్ని తగ్గించే కార్యక్రమాలు చేపడుతున్నారని మండిపడ్డారు. శ్రీ సత్యసాయి, ఆర్డీటీ ట్రస్టులు జిల్లాకు రెండు కళ్లులాంటివని, వాటికి ప్రాణం పోయాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రామగిరి మండల పర్యటనలో హెలికాప్టర్ దిగిన తర్వాత ఆయనపై అభిమానంతో వేలాదిమంది హెలీప్యాడ్ వద్దకు చొచ్చుకువచ్చారని, ఇది పూర్తిగా పోలీసుల వైఫల్యమేనన్నారు. హెలీప్యాడ్‌లోకి కేవలం 41 మందిని అనుమతించాలని ఎస్పీకి జాబితా అందజేసినా అంతమంది చొచ్చుకువచ్చారంటే వైఫల్యం ప్రభుత్వానిదా... పోలీసులదా... తమదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై కొన్ని మీడియా సంస్థలు అబద్ధాలను ప్రచారం చేశాయన్నారు. తనకు డీఎస్పీ విజయ కుమార్ మైకు ఇస్తే... హెలీప్యాడ్ వద్దకు ఎవరూ వెళ్లొద్దంటూ తాను రోడ్డుపైనే కూర్చుని, అందరూ ఇక్కడే కూర్చోవాలంటూ పదేపదే కోరానన్నారు. పోలీసుల వైఫల్యం వల్ల జగనన్నకు ప్రాణహాని కలుగుతోందని, ఆయన భద్రతపై కేంద్ర హోం మంత్రి, సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి భద్రతను తప్పించడానికి, ఆయనకు అపాయం తలపెట్టడానికి ప్రకాష్‌రెడ్డి కుట్ర పూరితంగా వ్యవహరించారంటూ తనవైపు మళ్లించారన్నారు. పాపిరెడ్డిపల్లిలో జరిగిన హత్యను మరుగుపరచడానికి మీడియా చేసిన పాపం ఇదన్నారు. కురుబ లింగమయ్యపై దాడి చేసిన సమయంలో 20 మంది ఉన్నారని కుమారులే చెబుతున్నా కేవలం ఇద్దరిపై కేసు పెట్టి తక్కిన 18 మందిని తప్పించారన్నారు. హంతకుల ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. జగన్‌మోహన్ రెడ్డిని రానీయనని, హెలికాప్టర్ దిగనీయనని మాట్లాడిన పరిటాల సునీత నోరు నొక్కాల్సింది పోయి హత్యను ఖండించిన, ప్రశ్నించిన తమ గొంతు నొక్కుతారా అని ప్రశ్నించారు. సమావేశంలో అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, బండి పవన్, మాదవరెడ్డి, మంజునాథ్, నరేంద్రరెడ్డి, లోకనాథరెడ్డి, ఈశ్వరయ్య, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

## దుర్మార్గం.. అత్యంత హేయం



- కూటమి సర్కారుపై జర్నలిస్టు సంఘాల మండిపాటు
- 'సాక్షి' ఎడిటర్‌పై వేధింపులు సిగ్గుచేటంటూ విమర్శలు
- మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికే కుట్రకు తెరలేపారని ధ్వజం

**అనంతపురం:** ఏపీలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు పడ్డాయి. కూటమి ప్రభుత్వంలో 'సాక్షి'పై కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి, అక్రమాలపై వార్తలు రాస్తున్నారనే అక్కసుతో 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసులు వేధింపు చర్యలకు దిగారు. సోదాల పేరుతో గురువారం విజయవాడలోని ధనుంజయ రెడ్డి ఇంటికి చేరుకున్న పోలీసులు.. ఎలాంటి నోటీసులు లేకుండానే లోపలికి ప్రవేశించి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేశారు. తలుపులు మూసివేసి గంటల తరబడి సోదాల పేరుతో హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో కూటమి సర్కారు నిరంకుశ ధోరణిపై జిల్లా జర్నలిస్టు సంఘాల నేతలు భగ్గుమన్నారు. పత్రికా స్వేచ్ఛపై దాడి సిగ్గుచేటంటూ మండిపడ్డారు.

### విలేకరులపై దాడులు పెరిగాయి



ఏపీలో విలేకరులపై దాడులు పెరిగాయి. పాత్రికేయులను దూషిస్తూ వీడియోలు పోస్ట్ చేయడం, వేధించడం నిత్యకృత్యంగా మారాయి. అధికార పార్టీకి చెందిన వారే ఇలా వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో మూలస్తంభమైన పత్రికా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి.

– రాచమల్లు భోగేశ్వర రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు



సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంట్లో పోలీసుల సోదాలను నిరసిస్తూ రాయదుర్గంలో తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు, ప్రజాస్వామ్యవాదులు

### పత్రికా స్వేచ్ఛపై దాడే



కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందుకే 'సాక్షి'పై చంద్రబాబు సర్కారు కక్ష సాధింపులకు దిగుతోంది. ఇది కచ్చితంగా పత్రికా స్వేచ్ఛపై సర్కారు చేస్తున్న దాడే. ప్రజా సంఘాలతో పాటు ప్రజలు కూడా ఈ నిరంకుశత్వాన్ని ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు వెళ్లడం అన్యాయం.

– కొత్తపల్లి అనిల్ కుమార్ రెడ్డి, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### పత్రికా స్వేచ్ఛను కాపాడాలి



జర్నలిస్టులపై వేధింపులకు పాల్పడటం సరికాదు. సాక్షాత్తూ ఓ పత్రిక ఎడిటర్‌ను టార్గెట్ చేయడం శోచనీయం. ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమే.ఇప్పటికైనా పత్రికా ఎడిటర్లపై బూటకపు కేసులు ఎత్తివేయాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి.

– తలారి రామాంజినేయులు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు

### తిరునాలలో అపశ్రుతి

**పెద్దవడుగూరు:** బండి శూల తిరునాలలో అపశ్రుతి చోటు చేసుకొంది. వివరాలు.. గురువారం గుత్తి అనంతపురం, కాశేపల్లి మీదుగా పామిడి మండలం రామరాజుపల్లి వరకూ ఎద్దులతో సురబండిని లాగే కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో కాడిమానుపై కూర్చొని ఎద్దులను తోలుతుండగా జి. వెంకటాంపల్లికి చెందిన సిద్ధపు రాజు అదుపు తప్పి కింద పడ్డాడు. పాదాలపై బండి చక్రం ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్సల కోసం అనంతపురం తరలించారు. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే పెద్దవడుగూరుకి చెందిన రైతులు తమ ఎద్దులను సురబండి లాగడానికి కట్టారు. ఈ క్రమంలో ఉన్నఫలంగా ఎద్దుల పట్టెడు తెగిపోయింది. అక్కడే ఉన్న రైతు నాగభూషణ ఎద్దును కట్టడి చేయడానికి ప్రయత్నించగా అతనిపై దాడి చేసింది. క్షతగాత్రుడికి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.



ఎద్దు పొడవడంతో గాయపడిన నాగభూషణ

# ఆర్టీసీలో ఆగని దోపిడీ

- రూ.లక్షలు దండుకుంటున్న ఉద్యోగులు
- అటకెక్కిన ఉరవకొండ డిపోలో రూ.42 లక్షల గోల్‌మాల్
- జిల్లా కేంద్రంలో అద్దె వాహనం పేరుతో రూ.3.60 లక్షలు స్వాహా
- ఏ ఒక్కరిపై కనిపించని చర్యలు
- ఆర్ఎం తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు

**అనంతపురం క్రైం:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో పాలన పూర్తిగా గాడి తప్పింది. అధికారంలో ఉన్నప్పుడే అందిన కాడికి దోచుకోవాలనే తీరుతో కొందరు ఉద్యోగులు బరితెగించారు. అక్రమాలకు తెరలేపి సంస్థ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. విషయం బయటకు పొక్కితే బదిలీ చేస్తారు.. అప్పటి వరకూ జేబులు నింపుకుంటే చాలు అనే ఫార్ములాను అనుసరిస్తూ రూ.లక్షలు దిగమింగుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అక్రమార్కుల కొమ్ము కాస్తున్న ఆర్ఎం తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**మచ్చుకు కొందరి అక్రమాలు ఇలా..**

ఉరవకొండ డిపోలో మేనేజరుగా పనిచేసిన ఓ ఉద్యోగి తీరు కారణంగా ఆర్టీసీకి రూ. 42 లక్షల రాయితీ దక్కకుండా పోయింది. ఈ విషయం కాస్త బహిర్గతం కావడంతో ఆయన గుట్టుచప్పుడు కాకుండా స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసి తప్పుకున్నారు. ఈ విషయం తెలిసినా.. ఆర్ఎం ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఆయన ఉద్యోగ విరమణ ఫైల్‌కు క్లీన్‌చిట్ ఇచ్చి పూర్తి స్థాయిలో సహకరించారు. అంతేకాక చాలా కాలం ఈ విషయాన్ని అత్యంత గోప్యంగా ఉంచారు. చివరకు విషయం వెలుగు చూడడంతో అలాంటి పొరపాటు జరగలేదని బుకాయించారు. కాగా, ఇదే అంశంపై గతంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన సమావేశంలో ఆ సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు చర్చ లేవనెత్తడం గమనార్హం. జల్లిపల్లి, మరూరు, కాశేపల్లి, రామాపురం వద్ద ఉన్న నాలుగు టోల్ గేట్లకు బస్సులకు రాయితీ పాసులు ఎందుకు పొందలేదని ఆరా తీసినట్లు సమాచారం. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డిపో మేనేజరుపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీసినట్లు తెలిసింది. చిరు ఉద్యోగుల తప్పిదాలను భూతద్దంలో చూసి కఠినంగా శిక్షించే అధికారులు... అదే ఉన్నత కేడర్‌లో ఉన్న వారి పట్ల సానుకూలంగా వ్యవహరిస్తుండడం ప్రస్తుతం కార్మికుల్లో అసహనం రేకెత్తిస్తోంది.

**వెలుగు చూడని దారుణాలెన్నో**

ఆర్టీసీలోని కీలక విభాగాల్లో అనేక తప్పిదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా ఆర్టీసీలోని విజిలెన్స్ లాంటి కీలక విభాగం కూడా ఆర్ఎం కనుసన్నల్లో పని చేస్తోంది. ఆర్ఎం చాంబర్ వద్ద విజిలెన్స్ కానిస్టేబుల్ ఒకరిని కాపలాగా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అన్ని విభాగాలను ఇక్కడ అధికారులు వారి సొంత పనులకు వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఆర్టీసీ బస్టాండులో నో పార్కింగ్ పేరుతో వసూలు చేస్తున్న డబ్బును విజిలెన్స్ సిబ్బంది వాటాలు వేసుకుని పంచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనంతపురం ఆర్టీసీ రీజియన్‌లోని అన్ని విభాగాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తే దారుణాలెన్నో వెలుగు చూసే అవకాశం లేకపోలేదు.

**కార్గో సేవల్లోనూ అక్రమాలు**

ఆర్టీసీలో కార్మికుల కష్టంతో వచ్చే ఆదాయాన్ని ఎలా దోచుకోవాలో కొంత మంది ఉద్యోగులకు బాగా వంటబట్టింది. ఇందుకు కార్గో సేవలే ఉదాహరణ. కార్గో కార్యకలాపాలను పర్యవేక్షించే అధికారికి వాహనం ఏర్పాటు చేసుకునే వెసులు బాటును ఆ సంస్థ కల్పించింది. అయితే సదరు అధికారి వాహనం లేకుండా నెట్టుకొస్తూ రికార్డులు సృష్టించి నెలకు రూ.30 వేలు చొప్పున తన సొంత ఖాతాలోకి వేసుకుంటున్నట్లు సమాచారం. అద్దె వాహనం పేరుతో ఏడాదికి పైగా రూ.3.60 లక్షలు లూటీ చేసినట్లు ఆధారాలతో సహా ఇటీవల పట్టుబడిన ఆ అధికారిపై నేటికీ ఎలాంటి చర్యలు లేవు.

## క్లుప్తంగా

### ఎల్‌టీ నియామకాలపై విచారణ

**అనంతపురం మెడికల్:** నగరంలోని పాతూరులో ఉన్న డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్ల నియామకాలపై అనపర్తి ఏరియా ఆస్పత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పద్మశ్రీ గురువారం విచారణ చేపట్టారు. ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 2023లో 56 పోస్టులను భర్తీ చేశారు. ఈ ప్రక్రియలో రోస్టర్ విధానాన్ని పాటించలేదంటూ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు విచారణకు సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆదేశించారు. దీంతో డాక్టర్ పద్మశ్రీ గురువారం విచారణ చేపట్టి రికార్డులు పరిశీలించి, స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో నియామకాలపై ప్రస్తుత డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఆఫీస్ కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. నివేదికను డైరెక్టర్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి కి అందజేయనున్నట్లు విచారణాధికారి పేర్కొన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఏరియా ఆస్పత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ రమాకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఫైనాన్స్ వ్యాపారంలో నష్టాలు తాళలేక ఓ వ్యక్తి అర్ధంతరంగా తనువు చాలించగా... జీవితంపై విరక్తితో విషం తాగి ఓ గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు.

**తాడిపత్రిటౌన్:** స్థానిక సీపీఐ కాలనీకి చెందిన రామనాథరెడ్డి (48) ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫైనాన్స్ వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. వడ్డీలకు ఇచ్చిన డబ్బును రాబట్టుకోలేక కుటుంబ పోషణ భారం కావడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం గురువారం స్థానిక ఓ లాడ్జ్ రూంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తాడిపత్రి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**గార్లదిన్నె:** మండలంలోని కనుంపల్లి క్రాస్ సమీపంలో ఉన్న రాళ్ల గుట్టలో గురువారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. దాదాపు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుంది. గులాబీ, తెలుపు రంగు గళ్ల టవాల్, ఫుల్ బనియన్, తెలుపు రంగు లుంగీ, తెలుపు రంగు అంగీ ధరించి ఉన్నాడు. సంఘటనా స్థలం వద్ద వాటర్ బాటిల్, చెప్పులు, కూల్‌డ్రింక్ బాటిల్, పురుగుల మందు డబ్బా పడి ఉన్నాయి. రెండు రోజుల క్రితం కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు గార్లదిన్నె పోలీసులు తెలిపారు. వ్యక్తి మిస్సింగ్‌లో సంబంధీకులు ఎవరైనా ఉంటే శింగనమల సీఐ (93460 10558), గార్లదిన్నె ఎస్ఐ (94407 96813)కు సమాచారం అందించాలని కోరారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



**తాడిపత్రి టౌన్:** స్థానిక కెనరా బ్యాంక్ ఎదుట గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 75 సంవత్సరాలు ఉంటాయని, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సీఐ (94407 96861), ఎస్ఐ (93469 17120)కు సమాచారం అందించాలని కోరారు.

## రూ.3 లక్షల వరకు ఏపీజీబీ పంట రుణాలు

- ఆంధ్రప్రదేశ్ గ్రామీణబ్యాంకు ఆర్ఎం శ్రీదేవి



**అనంతపురం అగ్రికల్చర్:** రైతులకు రూ.3 లక్షల వరకు పంట రుణాలు ఇస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (పూర్వ ఏపీజీబీ) రీజనల్ మేనేజర్ పి.శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా తమ బ్యాంకు శాఖల్లో పంట రుణాల రెన్యువల్స్, కొత్త రుణాల పంపిణీ జరుగుతోందన్నారు. ఎలాంటి మార్ట్‌గేజ్ లేకుండా పంటలను బట్టి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా రూ.3 లక్షల వరకు పంట రుణం మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ బ్యాంకుల విలీనంతో ఇపుడు ఏపీజీబీ శక్తివంతంగా మారిందన్నారు. ప్రజల అవసరాల నిమిత్తం మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. డిపాజిట్లపై 7.6 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.1 శాతం వడ్డీ రేటు వర్తింపజేశామన్నారు.

## రైతు నగదు దోచుకెళ్లిన దుండగులు

**కళ్యాణదుర్గం రూరల్:** రైతు నగదు దుండగులు దోచుకెళ్లిన ఘటన కళ్యాణదుర్గం పట్టణంలో జరిగింది. వివరాలు.. బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన రైతు తిమ్మప్ప గురువారం కళ్యాణదుర్గం పట్టణంలోని ఆంధ్రా బ్యాంక్‌లో రూ.5,00,000 విత్‌డ్రా చేశాడు. అనంతరం అక్కడి నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ వద్ద బైక్‌ను ఆపి నగదు అందులోని బ్యాగులో ఉంచి మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చిన తిమ్మప్ప బైక్ బ్యాగ్ తీసి ఉండటం గుర్తించాడు. అందులోని నగదు కనపించలేదు. దీంతో బాధితుడు లబోదిబోమంటూ పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



విజయభాస్కరరెడ్డి

**యాడికి:** జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న కురుకుంట గ్రామానికి చెందిన విజయభాస్కరరెడ్డి కనిపించడ లేదు. గత నెల 28న యాడికి మండలం కొట్టాలపల్లిలో జరిగిన వివాహ వేడుకలకు వచ్చిన ఆయన ఇప్పటి వరకూ ఇంటికి చేరుకోలేదు. ఆయన ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో గురువారం యాడికి పీఎస్‌లో తండ్రి గురివిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని చూపుతున్న విజిలెన్సు అధికారులు

**బొమ్మనహాళ్:** అక్రమంగా బొలెరో వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం బొమ్మనహాళ్ మండలంలోని సంగమేశ్వరస్వామి దేవాలయం వద్ద విజిలెన్సు అధికారులు పట్టుకున్నారు. బొమ్మనహాళ్ మండలంలోని పలు గ్రామాల్లో పేదల నుంచి తక్కువ ధరకే కొనుగోలు చేసిన 37 క్వింటాళ్ల రేషన్ బియ్యన్ని కేఏ34 డి2274 నంబరు గల బొలెరో వాహనంలో కర్ణాటకలోని చిత్రదుర్గ్ జిల్లా బి.జి.కెరె గ్రామానికి తరలిస్తున్నట్లుగా గుర్తించినట్లు విజిలెన్సు ఎస్ఐ గోపాలుడు తెలిపారు. ఘటనకు సంబంధించి డ్రైవర్ బసవరాజు, బియ్యం వ్యాపారులు జి.యల్లప్ప, రుద్రన్నపై రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్‌నాయక్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు.



# కుందుర్పి జెడ్పీటీసీకి త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

- ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సహచరుడి మృతి




గాయపడిన రాధాస్వామి, రాజు (ఫైల్)

**కుందుర్పి:** స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన సహచరుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. గురువారం సాయంత్రం తన సహచరుడు కరిగానిపల్లికి చెందిన ఉప్పర రాజు(37)తో కలసి ద్విచక్ర వాహనంపై మలయనూరు నుంచి కుందుర్పికి వెళుతుండగా కేజీబీవీ వద్దకు చేరుకోగానే ఎదురుగా రాళ్ల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి ద్విచక్ర వాహనంపై పడింది. ఘటనలో రాధాస్వామికి కుడికాలు విరిగింది. వాహనం నడుపుతున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై క్షతగాత్రులను కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలించారు. చికిత్స అందేలోపు రాజు మృతిచెందాడు. రాజుకు భార్య కమలమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాధాస్వామిని అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై కుందుర్పి పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రమాదం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ఫోన్‌లో రాధాస్వామిని పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం



బ్యాంక్ నోటీసు చూపుతున్న బాధిత రైతు హేమ్లా నాయక్

**వజ్రకరూరు:** స్థానిక ఎస్‌బీఐ అధికారుల తీరును నిరసిస్తూ బ్యాంక్ ఎదుట గురువారం ఓ గిరిజన రైతు ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు.. వజ్రకరూరు మండలం ఎస్ఎన్‌పీ తండాకు చెందిన హేమ్లానాయక్, సాలమ్మ దంపతులు తమకున్న 1.47 ఎకరాల భూమిలో పంటల సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్‌బీఐలో రూ.51వేల పంట రుణాన్ని పొందారు. రెండేళ్ల క్రితం సాలమ్మ మృతి చెందింది. ఆమె పేరుమీద తీసుకున్న రుణానికి వడ్డీతో కలిపి రూ.71,131 అయిందని, ఈ మొత్తాన్ని చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీనిపై బుధవారం సాయంత్రం హేమ్లా నాయక్ బ్యాంక్ అధికారులను కలసి డెత్ సర్టిఫికెట్ అందజేసి, మాట్లాడాడు. దీంతో సాలమ్మ ఖాతాలో ఉన్న రూ.21,600 ఆమె పేరుతో ఉన్న పంట రుణానికి బ్యాంక్ అధికారులు జమ చేశారు. విషయం తెలుసుకున్న హేమ్లా నాయక్ గురువారం బ్యాంక్ అధికారులను కలసి మాట్లాడాడు. ఆ సమయంలో వాగ్వాదం చోటు చేసుకోవడంతో మనస్తాపం చెంది బ్యాంక్ ఎదుట పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న ఎస్ఐ నాగస్వామి వెంటనే పురుగుల మందు డబ్బా లాక్కొని న్యాయం జరిగేలా చూస్తానని భరోసానివ్వడంతో రైతు శాంతించాడు.

## పోరుకు మేము సైతం

- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా రేపు ర్యాలీ
- జయప్రదం చేయాలని మాజీ సైనికుల పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ సైనికులు సుదర్శనరెడ్డి, నల్లపరెడ్డి

**రాప్తాడు:** ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టేందుకు పాక్‌తో భారత సైన్యం కొనసాగిస్తున్న యుద్ధంలో పాల్గొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని రాప్తాడుకు చెందిన మాజీ సైనికులు గొర్ల సుదర్శన్ రెడ్డి, నల్లపరెడ్డి స్పష్టం చేశారు. గురువారం రాప్తాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పహల్గాం పాశవిక చర్యకు ప్రతీకారంగా దేశ సైనికులు తొమ్మిది ఉగ్ర స్థావరాలను భూస్థాపితం చేయడాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం 6 గంటలకు రాప్తాడులో చేపట్టిన ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ర్యాలీ 44వ జాతీయ రహదారి నాలుగు రోడ్ల కూడలి నుంచి స్థానిక బస్టాండు వరకూ కొనసాగుతుందన్నారు. విజయకేతనం ఎగుర వేస్తూ ప్రతి భారతీయుడు యుద్ధ వీరులకు అండగా నిలవాలన్నారు. ఈ యుద్ధంపై ప్రజలు ఎలాంటి భయందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉగ్రవాదులు, వాళ్లకు సహకరించిన వాళ్లను భూమ్మీద లేకుండా చేసే పనిని త్రివిధ దళాలకు కేంద్రం అప్పగించందన్నారు. ఇలాంటి సమయంలో తాము సర్వీసులో ఉండి ఉంటే ఎంతో గర్వంగా అనుభూతి చెందేవారమని అన్నారు.

## ఆర్డీటీకి నిధులు తెప్పిస్తా

- ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్




సమావేశంలో మాట్లాడుతున్న కేఏ పాల్

**అనంతపురం టవర్‌క్లాక్:** ఆర్డీటిపై కక్ష సాధింపు చర్యలు తగదని ప్రభుత్వాలకు ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ సూచించారు. ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం చర్చించి ఆర్డీటీకి నిధులు అందేలా చొరవ తీసుకుంటానని పేర్కొన్నారు. గురువారం అనంతపురం పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమలో ప్రతి ఇంటికీ సేవలు అందించిన ఘనమైన ఆర్డీటీకి ఉందన్నారు. ఆర్డీటీకు అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. నిధుల సమీకరణకు ప్రపంచ దేశాల ప్రతినిధులతో మాట్లాడతానన్నారు. ప్రస్తుతం భారత్, పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని ఆపేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇందు కోసం పాకిస్తాన్‌కు వెళ్లి ఆ దేశ అధ్యక్షుడితో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రజాశాంతి పార్టీ అధికారంలోకి రావాలన్నారు. ప్రజాశాంతి పార్టీలో చేరి బలోపేతం చేయాలని కోరారు.

## 14న ఐటీఐలో జాబ్ మేళా

**అనంతపురం ఎడ్యుకేషన్:** బెంగళూరుకు చెందిన సేఫ్టీ వింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోఉద్యోగాల భర్తీకి ఈనెల 14న అనంతపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ ఏ గ్రేడ్ అయినా ఉత్తీర్ణులై, 18 ఏళ్లు నిండిన వారు అర్హులని ఐటీఐ ప్రిన్సిపల్ రామమూర్తి పేర్కొన్నారు. జీతం రూ. 19 వేలు, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం ఉంటుందన్నారు. వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలు అన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతో పాటు ఆధార్‌కార్డ్, ఫొటోలు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, కులధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 88868 85173 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

## నీట మునిగి యువకుడి మృతి



మృతుడు బాబావలి

**గార్లదిన్నె:** ఈత సరదా ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం ఇల్లూరుకు చెందిన షేక్ బాబావలి (28) కల్లూరులో వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ అదే గ్రామంలోనే నివాసముంటున్నాడు. గురువారం వేసవి తాపాన్ని తాళలేక స్థానికంగా ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లిన బాబావలి ఉన్నఫలంగా నీట మునిగాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గత ఈతగాళ్లను రంగంలో దించి బాబావలిని వెలికి తీశారు. అప్పటికే ఊపిరి ఆడక మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా తెలిపారు. కాగా, బాబావలికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

## క్లుప్తంగా

### ఎంఎల్‌హెచ్‌పీలకు సంఘీభావం



మాట్లాడుతున్న కేఏ పాల్

అనంతపురం కార్పొరేషన్‌: ప్రభుత్వ సర్వజనాస్పత్రి ముందు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు చేస్తున్న సమ్మెకు ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలను ఓపిగ్గా విన్నారు. వారి న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలకు తాము మద్దతుగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ప్రతినిధి గౌరి, అనూష, దివ్య మాట్లాడుతూ.. 6 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమను రెగ్యులరైజేషన్ చేయాలన్నారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకూ సమ్మె ఆపేది లేదన్నారు. అనంతరం వారు ఆపరేషన్ సింధూర్‌లో పోరాడుతున్న భారత సైనికులకు సెల్యూట్ చేశారు.

### కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన



లేబర్ కోడ్‌ల బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, హమాలీలు

అనంతపురం అర్బన్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పాతూరు తాడిపత్రి బస్టాండ్‌లోని హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌ల బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం పని చేస్తోందన్నారు. కార్మికులు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. మోదీ ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి వెంకటనారాయణ, హమాలీ సంఘం నాయకులు ఆదినారాయణ, నరసింహులు, రాజన్న, గౌరప్ప, వెంకటేష్, చంద్రప్ప, నాగేంద్ర, నాగేషు, వెంకటప్ప, రామాంజనేయులు, కుళ్లాయప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

### డీఎస్సీ గడువు పెంచాలి

అనంతపురం ఎడ్యుకేషన్‌: అన్ని కేటగిరీల అభ్యర్థులకు ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో 40 శాతం మార్కులకే డీఎస్సీ రాసుకునే అవకాశం కల్పించాలని హిందీ సేవా సదన్ వ్యవస్థాపకుడు, యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిమెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎస్.గైబువల్లి కోరారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. నార్మలైజేషన్ లేకుండా ఒక సబ్జెక్టుకు ఒక జిల్లాలో ఒకేసారి ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓసీ అభ్యర్థులకు 48 సంవత్సరాల వరకూ వయస్సు సడలింపు ఇవ్వాలని కోరారు. డీఎస్సీ గడువు పెంచేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

# ఆనందాల లోకం మాది

- వేసవిలో బాల్యస్మృతులు మరువలేనివి
- అప్పట్లో గోలీలాట, కుంటే ఆట, కోతికొమ్మచ్చులాటకు ప్రాధాన్యత
- చిన్నానాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న ప్రముఖులు

**సమ్మర్ స్పెషల్**





జీవితాన్ని ఆనందమయం చేసుకోవడం అంటే బాగా ఆడుకోవడమే అంటాడో కవి. నిజమే.. ఎవరి జీవితంలోనైనా ఆటపాటలు ఉంటేనే ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆనందానికి ఆనందం. రోజంతా ఎంత కష్టపడినా కాసేపు ఆడుకునే ఆటలే ఎంతో ఉత్సాహం, ఉత్తేజాన్ని అందిస్తాయి. ఇక వేసవి సెలవులు వచ్చాయంటే రెండు నెలల పాటూ ఆటల్లో మునిగితేలిపోవడం సహజంగా ఉండేదే. అయితే ఇప్పటి ఆటలు చాలా వరకు సెల్‌ఫోన్‌తో సాగుతున్నాయి. ఆ తరం వారి ఆటల్లో ఎంత ఆరోగ్యం, ఆనందమూ ఉండేదో అందరూ తెలుసుకునేందుకు ప్రముఖుల జీవితాల్లోని బాల్య విశేషాలను తెలుసుకునేందుకు సాక్షి వారిని పలకరించింది. బాల్య స్మృతులు గుర్తు చేసుకున్నప్పుడు కలిగిన ఉత్సాహం, ఆనందం వారి మాటల్లోనే విందాం..

– అనంతపురం కల్చరల్/రాప్తాడు:

#### సంతోషాలకు వేదికలు ‘పల్లెలు’



మాది ఆత్మకూరు గ్రామం. చిన్నప్పుడు ఆడుకున్న ఆటలు, అప్పటి ఆలోచనలు తలచుకుంటే సంతోషంతో పాటూ ఇప్పటితరం వారు టెక్నాలజీకి బానిసలైపోతుండటం తలచుకోవడం విచారకరం. మా అమ్మ లక్ష్మీదేవమ్మ నేను 6వ తరగతి ఉన్నప్పుడే చనిపోయారు. నాన్న రామిరెడ్డి నన్ను అన్ని విధాలా ప్రోత్సహించారు. వేసవి సెలవులొస్తే పల్లెలు సంతోషాలకు వేదికలయ్యేవి. ఆ రోజుల్లో దిగుడు బావులు తప్ప బోరు బావులుండేవి కావు. గంటలకొద్దీ ఈత కొట్టే వాళ్లం. కులాలు, మతాలకతీతంగా అందరూ ఓ చోట చేరి మా పాఠశాల మైదానాన్ని శుభ్రం చేసుకుని ఖోఖో, ఫుట్‌బాల్ ఆడుకునేవాళ్లం. బొంగరాలు పగలకొట్టేవాళ్లకు పందెంలో గెలిచినట్లు లెక్క. ఓడిపోయిన వారు కమరకట్టలు, కర్జికాయలు కొనిచ్చేవాళ్లు. – నాగేశ్వరరెడ్డి, స్టేషన్ డైరెక్టర్, ఆకాశవాణి

#### సమయం తెలిసేది కాదు..



మా పూర్వీకులందరూ రత్నగిరి సంస్థానాదీశులే. మా నాన్న ప్రభుత్వ ఉద్యోగం చేయడం వల్ల అనంతపురం వచ్చేశాం. కానీ వేసవి సెలవులొచ్చాయంటే అవ్వతాతలు, బాబాయిలు ఉన్న రత్నగిరికి వెళ్లేపోయేవాళ్లం. రొళ్ల మండలం రత్నగిరి చుట్టుపక్కల కొండలు, గుట్టలుండేవి. వాటిని నిత్యం స్నేహితులతో కబుర్లు చెప్పుకుంటూ ఎక్కడమంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఇక ఈతకొట్టడమనేది అందరి సహజంగా ఉండే సరదా. డింగ్‌డాండ్ బెల్, దొబూచులాట, చిల్లాకట్టె ఆటలు ఆడుతుంటే అసలు సమయం తెలిసేది కాదు. ఇంట్లో వాళ్లు ఇక ఆటలాపేసి వచ్చేయమన్నా వినేవాళ్లం కాదు. పాఠశాలలు కూడా ఇప్పటి మాదిరి ఒత్తిడి పెంచే కేంద్రాలు కావు.. వికాస చైతన్యపూరితంగా ఉండేవి.

– రత్నగిరి దేవరాజ్, పారిశ్రామికవేత్త

#### వేసవి సెలవుల్లో సందడే..



మేము చిన్నప్పుడు తిరుపతిలోనే ఉండేవాళ్లం. చదువులపై ఇప్పుడున్నంత ఒత్తిడి ఉండేది కాదు. సాయంత్రం అయిందంటే ఆటలే ఆనందానిచ్చేవి. ఇక వేసవి సెలవులొచ్చాయంటే ఆ సందడే వేరు. చక్రాన్ని తీసుకెళ్తూ దొర్లించుకుంటే వెళ్లడమంటే కారు తోలినతున్నంత ఆనందం అనిపించేది. గోళీల ఆటలు, సెవెన్ పీచెస్, తొక్కుడుబిల్ల ఆటలెంతో సరదాగా గడిచిపోయేవి. మా ఊరు చివర పెద్ద మర్రి చెట్టుండేది. దాని ఊడలు పట్టుకుని ఊగుతుంటే ఆ ఆనందానికి అవధులెక్కడుంటాయి. కాస్త వయస్సు వచ్చేసరికి క్రికెట్, బాల్‌బాడ్మింటన్ వచ్చేశాయి. ఇప్పటికీ నేను స్పోర్ట్స్‌ను వదలేదు. చిన్నతనం ఆటలు, కల్మషం లేని రోజులు మళ్లీ రావు. ఇప్పుడు పూర్తి భిన్నమే. సెల్‌ఫోన్లు పట్టుకుని జీవితం లాగించేస్తున్నారు.

– గోవర్ధన్ శ్రీనివాస్, డీడీఓ, నెహ్రూ యువకేంద్రం

#### ఆ అనుభూతి చెప్పలేం..



మాది చిత్తూరు జిల్లా పూతలపట్టు. నాగన్న ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేసేవాడు. 1 నుంచి 10వ తరగతి వరకు పూత్తురులో చదివాను. ఇంటర్ తిరుపతి, ఎంబీబీఎస్ అనంతపురంలో పూర్తి చేశాను. వేసవి సెలవులు రాగానే అమ్మమ్మ వాళ్ల ఊరికి వెళ్లే వాళ్లం. మా తోటి మిత్రులతో కలిసి ఉదయం నుంచి రాత్రి వరకు కర్రబిల్ల, గోళీల ఆట, తాడుతో బస్సు ఆట, కబడ్డీ, తాడాట, కట్టిపుల్ల ఆటలు ఆడుకునే వాళ్లం. చిన్నప్పుడు మొబైల్ ఫోన్లు, టీవీలు లేకపోవడంతో అందరం ఒకే చోట కలిసి కబుర్లు చెప్పుకునే వాళ్లం. రాత్రి పూట అందరం మేడ పైకి వెళ్లి మాట్లాడుకుంటూ అలాగే నిద్రలోకి జారుకునేవాళ్లం. మా మేనమామ దగ్గర వ్యవసాయం కూడా చేశాను. ఆ అనుభూతి మాటల్లో చెప్పేది కాదు.

– ఎం.శివకృష్ణ, వైద్యాధికారి, పీహెచ్‌సీ, రాప్తాడు

#### బాల్యం తిరిగిరానిది



మా చిన్నతనంలో మేము బుక్కరాయ సముద్రంలో ఉండేవాళ్లం. నేను 1 నుంచి 5 వరకు బీకేఎస్‌లో, 6 నుంచి 10 వరకు అనంతపురంలో చదువుకున్నా. మేము చదుకునేప్పుడు ఇప్పటి మాదిరి జెడ్పీ హైస్కూల్స్ కాకుండా డిస్ట్రిక్ట్ బోర్డు స్కూల్స్ అనేవారు. మా టైంలోనే జెడ్పీ స్కూల్స్ వచ్చాయి. సెలవులొచ్చాయంటే కుంటే ఆట, బద్దీలాట, గోళీకాయల ఆటలు ఆడుకునేవాళ్లం. ముఖ్యంగా సిగరెట్ ప్యాకులు ఏరుకుని వాటిని కరెన్సీలాగా పంచుకుని మురిసిపోయేవాళ్లం. ఆ రోజుల్లో ఆటలంటే శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఆరోగ్యానికి ఎంతో ప్రాముఖ్యం ఉండేవి. చిన్నప్పటి మధురమైన జ్ఞాపకాలను తలచుకుంటే ఎంతో ఆనందమనిపిస్తుంది.

– కేవీ రమణ, సామాజిక సేవా కార్యకర్త

#### సెలవులొస్తే బండ్లపైనే వెళ్లేవాళ్లం



మా ఊరు అమడగూరు మండలం మహ్మదాబాద్ గ్రామానికి అతి సమీపంలో తిమిరి కుంట్లపల్లి. ఆ రోజుల్లో మా ఊరికి బస్సు సౌకర్యం ఉండేది కాదు. సెలవులొస్తే బండ్లపైనే వెళ్లేవాళ్లం. ఈత నేర్చుకోవడానికి వెళ్లేదాన్ని. కానీ ఎందుకో అది సరిగ్గా రాలేదు. కోతికొమ్మచ్చులాట, కానుగ ఆకులతో పీకలు చేసి గట్టిగా ఊదుతూ సందడి చేసేవాళ్లం. తుమ్మచెట్ల నుంచి జిగురు తీసి దాంతోనే అతుకుపెట్టుకునే పద్ధతి గుర్తొస్తే నవ్వొస్తుంది. ఇంట్లో బారా కట్ట, పులి మేక, కేరమ్స్ వంటి ఆటలు సాయంత్రం రేసు పెట్టుకుని గుట్టలు ఎక్కడం, రాత్రుల్లో వెన్నెల కుప్పలు నేల బండ ఆటలు ఎంతో సరదాగా ఉండేవి. పెద్దలు చెప్పే కథలు ఎంతో ఆసక్తికరంగా ఉండేవి. బాల్యం నాటి ఆనందాల లోకం గుర్తొస్తే మనసు ఆహ్లాదంతో నిండిపోతుంది.

– డాక్టర్ అనంత మాలతి, కవయిత్రి

## విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రాయల్ వెంకటేష్

అనంతపురం ఎడ్యుకేషన్‌: అసంబద్ధ నిర్ణయాలతో కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు మండిపడ్డారు. విద్యావ్యవస్థలో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఉపాధ్యాయ భవనంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు మాట్లాడారు. ధర్నాకు జిల్లా వ్యాప్తంగా అన్ని జోన్ల నుంచి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ఉపాధ్యాయులు తరలిరావాలన్నారు. జాతీయ విద్యా విధానం, విద్యా హక్కు చట్టంలో పేర్కొన్న మేరకు అన్ని పాఠశాలలో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు వెంటనే ఓపీఎస్ అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ బి. వెంకటరమణ, జీఓ కమిటీ కన్వీనర్ బాల రామ్మోహన్, నాయకులు హనుమంతు, రామమూర్తి, ప్రసాద్, ఫక్రుద్దీన్, నస్రుల్లా, మధుసూదన్, మన్సూర్ పాల్గొన్నారు.

## డబ్బు వసూలు చేయడం దారుణం

అనంతపురం ఎడ్యుకేషన్‌: స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో తరగతులకు రాకపోతే ఇంత డబ్బు చెల్లించాలని ఫిక్స్ చేయడంపై ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఐటీఐలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమా మహేష్ మాట్లాడుతూ.. ఒకరోజు అబ్‌సెంట్ అయితే రూ.200, వారం రోజులైతే రూ.1,000 చొప్పున యాజమాన్యం వసూలు చేస్తోందన్నారు. ఐటీఐ కళాశాలలో ఫ్యాన్లు లేకపోయినా, లైట్లు పనిచేయక పోయినా వాటి కోసం విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేయడం దారుణమని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి బలవంతంగా వసూళ్లు చేస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ నగర కోశాధికారి నాని, సహాయ కార్యదర్శి సమీర్, సాయి, ప్రవీణ్ బాబు, జాన్ పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయండి



మూలింటి లోకనాథరెడ్డిని సన్మానిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్‌: ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకమైన కామారుపల్లి మాజీ సర్పంచ్ మూలింటి లోకనాథరెడ్డిని గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సన్మానించారు. లోకనాథరెడ్డితో పాటు ఆర్టీఏ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అక్కంపల్లి మాధవరెడ్డి, విద్యార్థి విభాగం నరేంద్రరెడ్డి తదితరులను సన్మానించి అభినందించారు. పార్టీ కోసం బాగా పని చేయాలని సూచించారు. కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లిరెడ్డి, జనార్దన్ రెడ్డి, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



శిక్షణ ఇస్తున్న సీటీఐఓ వి.లక్ష్మానాయక్

అనంతపురం అగ్రికల్చర్‌: ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నాచురల్ ఫార్మింగ్ (ఎన్‌ఎఫ్) చీఫ్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ (సీటీఐఓ) వి.లక్ష్మానాయక్ తెలిపారు. స్థానిక జెడ్‌బీఎన్‌ఎఫ్ కార్యాలయంలో రాయలసీమ జిల్లాలకు చెందిన 22 మంది డీపీఎంయూ సిబ్బందికి ఈనెల 5 నుంచి ఏర్పాటు చేసిన వర్క్‌షాపు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. సాధ్యమైనంత ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విచ్చలవిడి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల అధిక పెట్టుబడులు, తగ్గుతున్న దిగుబడులు కారణంగా రైతులకు వ్యవసాయం భారమవుతున్న తరుణంలో ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటించడమే శరణ్యమన్నారు. ఏడాది పొడవునా పంటలు పండించే పద్ధతులు తెలియజేయాలని సూచించారు. గో ఆధారిత ఉత్పత్తుల ద్వారా చివరకు ఒట్టి నేలలో పంటలు వేసుకునేలా (ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్–పీఎండీఎస్) అవకాశం ఉందన్నారు. అటు వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటల ద్వారా మెరుగైన ఆదాయం వస్తుందని తెలిపారు.

## ఆర్డీటీని కనుమరుగు చేసేందుకు కుట్ర

అనంతపురం టవర్‌క్లాక్‌: ఆర్డీటీని పేదలకు దూరం చేయడానికి కేంద్రం కుట్రలు చేస్తోందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని కోరుతూ అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్ద చేపటిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. సాకే హరి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. నిధులు రాకుండా అడ్డుకట్ట వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కోట్ల గంగాధర్, సుగమంచి శ్రీనివాసులు, సురేష్ బాబు, నాగన్న, ఓబులేసు, అనిల్ కుమార్, రాజు, షఫీ, ఆనంద్, చిన్న ఋూం.నేయులు, కృష్ణారెడ్డి, రామచంద్రా రెడ్డి, ప్రభాకర్, రాము, రాజు, గోవర్ధన్, రామకృష్ణ, నారాయణ స్వామి, వెంకటేష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### 24న మోడల్ డీఎస్సీ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్‌: ఈనెల 24న నిర్వహించే మోడల్ డీఎస్సీ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం డీఓఈ ప్రసాద్‌బాబు, అర్బన్ బ్యాంకు చైర్మన్ మురళీధర్ చేతుల మీదుగా వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు ఎం.చంద్రశేఖర్, కృష్ణకుమార్, జె.వెంకటాద్రి, రొళ్ల భాస్కర్, అనిల్ నాయుడు పాల్గొన్నారు.

### 500 మందికి రక్త పరీక్షలు

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలో వైద్యాధికారి శివ కృష్ణ ఆధ్వర్యంలో గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పూతలు (రక్త పరీక్షలు) చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ జిల్లా ఆఫీసర్ మద్దయ్య మాట్లాడుతూ.. ప్రసన్నాయపల్లి పంచాయతీలో పైలేరియా సర్వేలో భాగంగా సుమారు 500 మందికి రక్త పరీక్షలు చేశామని తెలిపారు. ఈ సర్వే చీకటి పడిన తర్వాత మాత్రమే చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీధర్, నూర్ బాషా, నరసింహ, ఎంపీహెచ్‌ఈఓ మునాఫ్, ఎంపీహెచ్‌ఏ డెవిడ్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### బాల్య వివాహాలు నేరం

రాప్తాడు: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం. బాల్య వివాహాలు చేసి వారి జీవితాలను నాశనం చేయవద్దని వైద్య ఆరోగ్య శాఖ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం మండలంలోని గంగలకుంటలో బాల్య వివాహాలు, టీనేజ్ గర్భం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిర్మూలనను అందరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లలోపు వివాహాలు చేయరాదన్నారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానా, రెండేళ్లు జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణమ్మ, ఏఎన్‌ఎం గొల్ల అనిత, వైద్య సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

### ప్రజా సమస్యలపై పోరాడతాం

ఆత్మకూరు: ప్రజా సమస్యలపై నిరంతరం సీపీఐ పోరాడుతూ ప్రజలకు అండగా నిలుస్తుందని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. గురువారం ఆత్మకూరులో సీపీఐ నాయకుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా భూ సమస్యలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉద్యమాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సహాయక కార్యదర్శి శ్రీకాంత్, మండల కార్యదర్శి రామకృష్ణ, శివ, ఓబులేష్, తులసీనాయక్, హరి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

### సర్టిఫికెట్ జారీలో జాప్యంపై ఫిర్యాదు

అనంతపురం: బీఎస్సీ కాన్వొకేషన్ సర్టిఫికెట్ జారీలో పరీక్షల విభాగం ఉద్యోగులు జాప్యం చేస్తున్నారంటూ రిజిస్ట్రార్ రమేష్ బాబుకు గురువారం హెచ్.విశ్వనాథ్ అనే విద్యార్థి ఫిర్యాదు చేశాడు. ఏప్రిల్ 17న దరఖాస్తు చేస్తే సర్టిఫికెట్ ఇవ్వకుండా కొర్రీలు వేస్తూ.. ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. జిరాక్స్ సర్టిఫికెట్లలో గెజిటెడ్ సంతకం లేదని వెనక్కి పంపగా.. సరిచేసి తిరిగి పరీక్షల విభాగంలో ఇచ్చేందుకు రాగా.. పరీక్షల విభాగం ఉద్యోగులు దౌర్జన్యానికి దిగారని పేర్కొన్నాడు. పరీక్షల విభాగం నుంచి బయటకు తోసేసినట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ అంశాన్ని మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

### సంచార జాతులపై అధ్యయనం

అనంతపురం: ఎస్కేయూ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజన్ పాలసీ విభాగం ఆధ్వర్యంలో ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సంచార జాతుల జీవన స్థితిగతులపై అధ్యయనం చేశారు. ఎస్కేయూలో గురువారం వారికి యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) లైవ్ స్ట్రీమ్ ప్రోగ్రామ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించారు. సంచార జాతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజన్ పాలసీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ మునినారాయణప్ప, మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ నంజుండప్ప, ఉర్దూ వర్సిటీ ప్రొఫెసర్ తాహా, డాక్టర్ అలివేలమ్మ (తమిళనాడు) సంచార జాతుల పథకాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సీఎస్ఎస్ఐ సహ నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస రావు, డాక్టర్ వెంకట రెడ్డి, టి.కృష్ణా రెడ్డి, బి.కొండారెడ్డి, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పీఆర్ డీఈఈ బాధ్యతల స్వీకరణ



డీఈఈ కృష్ణజ్యోతికి శుభాకాంక్షలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు, ఉద్యోగులు

అనంతపురం సిటీ: పంచాయతీ రాజ్ సబ్ డివిజన్–2 డీఈఈగా జె.కృష్ణజ్యోతి గురువారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ఆ శాఖ ఎస్ఐ మహమ్మద్ జహీర్ అస్లాం, ఈఈ ప్రభాకర్‌రెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆమెను ఏపీ జేఏసీ–అమరావతి అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దివాకర్ రావు, పంచాయతీరాజ్ సబ్ డివిజన్–1 డీఈఈ లక్ష్మీనారాయణ, పీఐయూ డీఈఈ నారాయణస్వామి, పోలీస్ బెటాలియన్ జిల్లా అధ్యక్షుడు తలారి పెద్దయ్య, టైపిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీఎస్ ప్రసాద్, కార్యాలయ ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

### కళాజాతతో మేల్కొలుపు

అనంతపురం మెడికల్‌: కళాజాత ద్వారా ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో కళాజాత కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. హెచ్ఐవీ ప్రభావిత ప్రాంతాల్లో 20 రోజుల పాటు కళా బృందాలు రోజుకొక నాటకం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సూపర్‌వైజర్ జీవీ రమణ, పీఎంఓ నాగన్న, మురళీ, నారాయణ స్వామి, చైల్డ్ ఫండ్ ఇండియా రమేష్ యాదవ్, రిడ్స్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయలక్ష్మి

ఆత్మకూరు: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయలక్ష్మి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనరసింహా సెలవులో వెళ్లారు. ఆయన స్థానంలో రాప్తాడు ఎంపీడీఓ విజయలక్ష్మిని ఆత్మకూరు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ సిబ్బంది నూతన ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

### పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

అనంతపురం అర్బన్‌: అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి స్థలంతో పాటు ఇంటిని ప్రభుత్వం నిర్మించి ఇస్తే ఇబ్బంది లేకుండా జీవిస్తారన్నారు. పేదల పరిస్థితిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. నాయకులు ప్రకాష్, మసూద్, ముత్తూజ, వెంకటనారాయణ, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

### నేడు ‘పంచమాతృక పూజ’

అనంతపురం కల్చరల్‌: తపోవనంలోని జగదీశ్వరాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 1 గంట వరకూ పంచమాతృక పూజ జరుగుతుందని చిన్మయా మిషన్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి తెలిపారు. గురువారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో ‘పంచమాతృక పూజ’ పోస్టర్‌ను ఆవిష్కరించారు. తల్లిప్రాధాన్యత తెలిపే అనేక కార్యక్రమాల ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా 8712345520 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నాయక్ తదితరులు పాల్గొన్నారు.